‘సారథి’ అమలులో తెలంగాణ ఫస్ట్

● జూన్ ఒకటి నాటికి ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ ప్రారంభించాలి ● వాహన్ పోర్టల్ డేటాలో సాంకేతిక సమస్యలు రావద్దు ● రవాణా శాఖ రాష్ట్ర స్థాయి సమీక్షలో మంత్రి పొన్నం



మన తెలంగాణ/హైదరాబాద్: రవాణా శాఖలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ బలోపేతం చేస్తూ ఆదాయాన్ని పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. 2024.25లో రవాణా శాఖ రూ.6910.90 కోట్లు ఆదాయం వసూలు కాగా, 2025.26 లో రూ.7097.38 కోట్లు వసూలైందని తెలిపారు. ఈవీ పాలసీ అమలు ద్వారా రవాణా శాఖ ఆదాయం కొంతమేర తగ్గినట్లు అధికారులు వెల్లడించారని అన్నారు. తగ్గిన ఆదాయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ బలోపేతం చేస్తూ ఆదాయ మార్గాలు పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక , మైనింగ్, ఓవర్ లోడింగ్ వాహనాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచాలన్నారు. సచివాలయంలో రవాణా శాఖ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం రాష్ట్ర స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిజామాబాద్ మహారాష్ట్ర , ఆదిలాబాద్ మహారాష్ట్ర, మెదక్ కర్ణాటక తదితర సరిహద్దు జిల్లాల రవాణా శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్టీవో కార్యాలయాల్లో పెండింగ్ లైసెన్స్ ఇతర పౌర సేవలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

సారథి అమలులో దేశంలోనే ప్రథమ స్థానంలో తెలంగాణ

సారథి అమలులోకి వచ్చిన తర్వాత 8 నెలల్లోనే దేశంలో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. ఏఎంవీఐ లకు ఇచ్చిన శిక్షణ మాదిరి ఇతర రవాణా శాఖ అధికారులకు విడతల వారిగా శిక్షణ ఇవ్వాలనీ అధికారులకు సూచించారు. రవాణా శాఖ గౌరవాన్ని పెంపొందించేలా అధికారులు పని చేయాలని సూచించారు.


రాష్ట్రంలో 37 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లు మంజూరు అయ్యాయని వాటిని జూన్ 1న తొలి టెస్టింగ్ స్టేషన్ ప్రారంభించుకునేలా పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ కోసం కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం దాదాపు ఈవీ పాలసీ తీసుకొచ్చిందని ఇప్పటి వరకు దాదాపు వెయ్యి కోట్లు టాక్స్ మినహాయింపు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్క్రాపెజ్ పాలసీ తీసుకొచ్చిందని ఇప్పుడు రాష్ట్రంలో మూడు కేంద్రాలు ఉండగా జిల్లా కేంద్రానికి ఒక ఆర్వీఎస్ఎఫ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెహికిల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్ నిర్భయ ఫ్రేమ్ అందుబాటులోకి రానుందని తెలిపారు.

తొలి రహవీర్ నల్గొండ వాసికి రూ.25 వేల చెక్కు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రహవీర్ స్కీమ్, క్యాష్ లెస్ ట్రీట్మెంట్‌లో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందని ఎవరికైనా ప్రమాదం జరిగినప్పుడు అత్యవసరంగా హాస్పిటల్ కి తీసుకెళ్లిన వారికి రహవీర్ అవార్డు కింద రూ.25 వేలు బహుమతి అందించనున్నారు. రహవీర్ అమలులోకి వచ్చిన తర్వాత తొలి రహవీర్ నల్గొండ జిల్లాకు చెందిన గణపతి వెంకన్నకి రూ.25 వేల చెక్కు ఇచ్చి అభినందించారు. పిఎం రహత్ కింద రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు లక్షా 50 వేల రూపాయల వరకు ఉచిత చికిత్స అందించవచ్చని ప్రజలకు వీటిపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

8 ఎకరాలు రూ.1200 కోట్ల విలువ!

ఖానామెట్‌లో ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకున్న హైడ్రా



మన తెలంగాణ/ సిటీబ్యూరో: ఐటీ కారిడార్‌లో సుమారు రూ.1200 కోట్ల విలువ చేసే 8 ఎకరాల ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్‌లో పేరున్న రెండు సంస్థలు స్వాహా చేసే యత్నాన్ని హైడ్రా నిలువరించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లో సర్వే నెం.55 లోని 8 ఎకరాలకుపైగా ఉన్న ప్రభుత్వ భూమిని వాసవి, మీనాక్షీ అనే రెండు పెద్ద రియల్ ఎస్టేట్ సంస్థలు కాజేసేందుకు పావులు కదుపుతున్నాయి. ఇది గుర్తించిన పలువురు స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో పూర్తి విచారణ చేపట్టిన హైడ్రా ఆ ప్రభుత్వ భూమిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్లను ఆర్‌సీసీ నిర్మాణాలను తొలగించి ఆ భూమిని మంగళవారం స్వాధీనం చేసుకున్నది. వాసవి సొంతంగా తాను వేసిన తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేసుకున్నది. ఐటీ హబ్‌కు చేరువలో బడా రియల్ ఎస్టేట్ సంస్థల స్వాధీనంలో ఉన్న 4.20 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు.. కొలను సబితకు చెందిన 4 ఎకరాల భూమిని హైడ్రా స్వాధీనం చేసుకున్నది. ఇందులో నెలకొల్పిన ఆర్‌సీసీ ప్లాంట్‌ను వాసవి నిర్మాణ సంస్థ స్వయంగా తొలగించుకున్నది. కార్మికుల కోసం వేసిన తాత్కాలిక షెడ్లను హైడ్రా తొలగించింది. మొత్తం 8 ఎకరాలకుపైగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను హైడ్రా తొలగించి ప్రభుత్వ భూమి అని తెలుపుతూ బోర్డులు ఏర్పాటుచేసింది. హైడ్రా కాపాడిన భూమి విలువ మార్కెట్ ధర ప్రకారం సుమారు రూ.1200ల కోట్లకు పైగా ఉంటుందని అధికారుల అంచనా. గతంలోనూ ఇక్కడ ఆక్రమణలను హైడ్రా తొలిగించింది. సర్వే నంబర్ 53లోని మేడికుంట ఆక్రమణలతో పాటు.. సర్వే నంబర్ 55 లోని ప్రభుత్వ భూమిని 11 ఎకరాల వరకు హైడ్రా స్వాధీనం చేసుకున్నది.

ఆక్రమణకు వాసవి, మీనాక్షీసంస్థల యత్నం

ఖానామెట్ విలేజ్‌లోని ఈ భూమి అసైన్డ్ ల్యాండ్. రంగారెడ్డి కలెక్టర్ ఈ భూమిని ప్రోహిబిటెడ్ లిస్టులో ఇప్పటికే చేర్చారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వానికి చెందినదిగా పేర్కొన్నారు. అదే భూమిని తమదిగా మీనాక్షి రియల్ ఎస్టేట్ సంస్థ చెప్తూ వస్తున్నది. వాసవి నిర్మాణ సంస్థ ఆ భూమిలోనే ఆర్‌సీసీ ప్లాంటులతో పాటు.. భవన నిర్మాణ కార్మికులకు షెడ్లను ఏర్పాటు చేసింది. నిర్మాణ సామగ్రిని కూడా ఆ ప్రభుత్వ భూమిలోనే నిలువ చేస్తున్నది. ఇలా ప్రభుత్వ భూమిని వినియోగించుకుంటూ మొత్తం 4.20 ఎకరాల ప్రభుత్వ భూమిని తమ స్వాధీనంలోకి తీసుకున్నది. ఈ రెండు సంస్థలకు తోడు ఇదే సర్వే నంబర్‌లో ఉన్న మరో 4 ఎకరాల భూమిని కొలను మాధవరెడ్డి కుమార్తె కొలను సబితదిగా చెప్తూ వస్తున్నారు. బౌన్సర్లను కాపలాగా పెట్టారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో సంబధిత విభాగాల అధికారులతో కలిసి హైడ్రా విచారించి ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకున్నది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. మొత్తం 8 ఎకరాలకుపైగా ఉన్న భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటుచేశారు.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఎపి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి అరెస్ట్

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఎపి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతి నివాసంతో పాటు పలు ప్రాంతాల్లో ఎసిబి బృందాలు ఏకకాలంలో మంగళవారం సోదాలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో భారీగా అక్రమాస్తులు బయటపడటంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం తాడేపల్లి, ఉండవల్లితో పాటు మొత్తం నాలుగు ప్రాంతాల్లో ఎసిబి అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. విశాఖపట్నం ఎండాడలో ఒక విలాసవంతమైన ఫ్లాట్, తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లిలో జీ+2 భవనాన్ని గుర్తించారు. వీటితో పాటు 770 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి వస్తువులు, రూ.1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో మరో రూ.3 లక్షలు, ఒక కారు, ద్విచక్ర వాహనం ఉన్నట్లు ఎసిబి వర్గాలు పేర్కొన్నాయి.

రెండుచోట్లా విజయ్ నామినేషన్‌కు ఆమోదం

చెన్నై: టీవీకే అధినేత విజయ్ పెరంబూరు, తిరుచిరాపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఏప్రిల్ 23న జరగనున్న ఎన్నికల కోసం దాఖలు చేసిన నామినేషన్లు మంగళవారం పరిశీలన అనంతరం ఆమోదించామని అధికారులు తెలిపారు. పెరంబూరులో పత్తాళి మక్కల్ కచ్చి (పీఎంకే) సభ్యులు లేవనెత్తిన అభ్యంతరాలను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. అక్షేపణల్లో భాగంగా నటుడిగా జీవితాన్ని ప్రారంభించి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ ఆస్తి పన్నులు చెల్లించలేదనే ఆరోపణల ఆధారంగా ఆయన అఫిడవిట్‌ను తిరస్కరించాలని వారు డిమాండ్ చేశారు. విజయ్ ఈ ఎన్నికల ద్వారా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభిస్తూ రెండు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీని ఫిబ్రవరి 2, 2024 న స్థాపించారు. ఈ పార్టీకి ఎన్నికల సంఘం “విసిల్” గుర్తును కేటాయించింది. రాష్ట్ర రాజకీయాల్లో డీఎంకే–ఏఐఏడీఎంకే ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ, టీవీకే రాష్ట్రంలోని 234 అసెంబ్లీ స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తోంది.

20 మంది సైబర్ నేరస్థుల అరెస్టు

బాధితులకు రూ.1.59 కోట్లు రీఫండ్

ఐదు రాష్ట్రాల్లో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల ఆపరేషన్

మన తెలంగాణ/ సిటిబ్యూరో: హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు ఐదు రాష్ట్రాల్లో చేపట్టిన ఆపరేషన్‌లో 13 సైబర్ నేరాల్లో నిందితులుగా ఉన్న 20 మందిని అరెస్టు చేశారు. సైబర్ నేరస్థుల చేతిలో మోసపోయిన బాధితులకు రూ. 1,59,69,564 రీఫండ్ చేశారు. కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరస్థుల చేతుల్లో మోసపోయిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాటి ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక ఆపరేషన్ చేశారు. 20 మంది నిందితులు పెట్టుబడి మోసం, ట్రేడింగ్ మోసం, గేమింగ్, జాబ్ ఫ్రాడ్, సోషల్ మీడియా, మ్యాట్రిమోనియల్, క్రెడిట్ కార్డు, ఇంపార్సనేషన్ మోసాలున్నాయి. అరెస్టైన నిందితుల్లో తెలంగాణ 15, ఏపీ 1, గోవా 1, కేరళ 2, రాజస్థాన్‌కు చెందిన ఒకరున్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 6,50,000 నగదు, మొబైల్ ఫోన్లు 14, ల్యాప్‌టాప్‌లు 4, చెక్ బుక్కులు 9, సెల్ కంపెనీ స్టాంపులు 2 స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ప్రకటన చూసి, ఆర్థిక అవసరాల కోసం దానిపై క్లిక్ చేసింది. అది ఆమెను ఒక వాట్సాప్ నంబర్‌కు చేర్చింది. అక్కడ ఆమెకు ఒక వెబ్‌సైట్ లింక్ పంపి, రిజిష్టర్ చేసుకోమని సూచించారు. మొద ట్లో తక్కువ పెట్టుబడితో లాభాలు రావడంతో నమ్మిన బాధితురాలు పెద్ద మొత్తంలో డబ్బు డిపాజిట్ చేసింది. చివరికి ఆమె మొత్తం రూ.26,07,01, 460 నష్టపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రాజేష్ వెంకటరామన్ (హైదరాబాద్), భమిడిపాటి అభిషేక్ (మేడ్చల్), అగస్టీన్ విలియమ్స్ (నల్లగండ్ల, కేరళ మూలాలు), మన్మీత్ శర్మ అలియాస్ సోనియా (అంజున, గోవా)లను అరెస్టు చేశారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భైంసా బ్రాంచ్-11084
నిర్మల్ రోడ్, భైంసా-504103. నిర్మల్ జిల్లా.
ఇ-మెయిల్ ఐడి : sbi.11084@sbi.co.in

స్వాధీనతా ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(1) క్రింద (స్థిరాస్తి కొరకు)

[illegible] సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్, యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3 మరియు సెక్షన్ 13(2) తో చదువబడుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భైంసా (11084) బ్రాంచ్, నిర్మల్ రోడ్, భైంసా యొక్క అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకందారు తేది: 28.01.2026 తో జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారం రుణగ్రహీత: 1) మెస్సర్స్ కృష్ణ కాటన్ ట్రేడింగ్ కంపెనీ, యజమాని: శ్రీ జాదవ్ గోవింద్ రావు తండ్రి జాదవ్ దత్తురామ్, యూనిట్ చిరునామా: 4-3-2/2బి, నర్సింహ ఆయిల్ మిల్ ఎదురుగా, భైంసా-504103. నివాసం చిరునామా: శ్రీ జాదవ్ గోవింద్ రావు తండ్రి జాదవ్ దత్తురామ్, ఇంటి నం. 4-3-126/8ఎ, సంతోష్ నగర్, భైంసా జిల్లా: నిర్మల్, పిన్-504103. హామీదారులు: 1) శ్రీ జాదవ్ నాగేందర్ తండ్రి జాదవ్ గోవింద్ రావు, ఇంటి నం. 4-3-126/8ఎ, సంతోష్ నగర్, భైంసా జిల్లా: నిర్మల్ పిన్:504103. 2) శ్రీ జాదవ్ ప్రదీప్ తండ్రి జాదవ్ గోవిందరావు, ఇంటి నం. 4-3-126/8ఎ, సంతోష్ నగర్, భైంసా, జిల్లా: నిర్మల్ పిన్:504103 వారిని నోటీసు నందు తెలియజేయబడిన బకాయి మొత్తము 28.01.2026 నాటికి రూ.5,59,99,637/- (రూపాయలు ఐదు కోట్ల యాభై తొమ్మిది లక్షల తొంభై తొమ్మిది వేల ఆరు వందల ముప్పై ఏడు మాత్రమే) మరియు 29.01.2026 నుండి మొత్తంపై ఒప్పంద రేటు ప్రకారం, భవిష్య వడ్డీతో అనుషంగిక ఖర్చులు వ్యయాలు చార్జీలతో కలిపి సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లించాలని కోరడమైనది.

కాని సదరు రుణగ్రహీత బకాయి మొత్తమును చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడు సదరు చట్టము యొక్క సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ ఈ క్రింది సంతకందారు క్రింద తెలిపిన ఆస్తిని 06 ఏప్రిల్, 2026న స్వాధీనము చేసుకోవడమైనదని రుణగ్రహీతలు/హామీదారు మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

కావున ప్రత్యేకించి రుణగ్రహీతలు/ హామీదారు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనీయు ఒకవేళ జరిపినట్లయితే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భైంసా (11084) బ్రాంచ్, నిర్మల్ రోడ్, భైంసా వారికి చెందవలసిన బకాయి మొత్తం 28.01.2026 నాటికి రూ.5,59,99,637/- (ఐదు కోట్ల యాభై తొమ్మిది లక్షల తొంభై తొమ్మిది వేల ఆరు వందల ముప్పై ఏడు మాత్రమే) ప్లస్ అతరువాత ఏదైన చెల్లించిన మొత్తం తగ్గించి దానిపై వడ్డీ ఖర్చులను క్రింద వర్తించును.

సెక్యూర్డ్ ఆస్తులు విడిపించుకొనుటలో లభ్యత సందు గల సమయమునకు సంబంధించి చట్టం లోని సెక్షన్ 13 ఉప సెక్షన్ (8) క్రింద నిబంధనలు గమనించవలసిందిగా రుణగ్రహీతలు/హామీదారులను కోరడమైనది.

స్థిరాస్తుల వివరణ : 1) డాక్యుమెంట్ నెం. 3337/2017 తేది.22.09.2017 ప్రకారం యజమాని శ్రీ జాదవ్ గోవింద్ రావు తండ్రి జాదవ్ దత్తురామ్ కు చెందిన నిర్మల్ జిల్లా, భైంసా రెవెన్యూ మండలం, మున్సిపాలిటీ క్రింద భైంసా ఆనంద్ నగర్, నిర్మల్ రోడ్, గీత పెట్రోల్ పంప్ దగ్గర సర్వే నం. 701 లో ఉన్న ప్లాట్ నం. 15 & 16 ల పై నిర్మించిన 305.55 చ.గ.ల. విస్తీర్ణం మరియు ప్లింత్ ఏరియా గ్రౌండ్ ఫ్లోర్ 1746.67 చ.అ.ల. మొదటి అంతస్తు 1746.67 చ.అ.ల. రెండవ అంతస్తు 1746.67 చ.అ.ల. గల ఇంటి నం. 4-3-ఎస్ఐ0001 గల ఆర్‌సిసి రూఫ్ నివాస భవనము. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం. 17 దక్షిణం: ప్లాట్ నం.లు 52 మరియు 51, తూర్పు: 30' వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నం. 11 మరియు 12.

2) డాక్యుమెంట్ నెం. 1610/2008 తేది.09.05.2008 ప్రకారం యజమాని శ్రీ జాదవ్ గోవింద్ రావు కు చెందిన నిర్మల్ జిల్లా, బాసర గ్రామం & మండలం, అమ్మగుంటం భవన్ ప్రక్కన ఇంటి నం. 9-12 సమీపంలో గల సర్వే నం. 504/సి లో 350.86 చ.గ.ల. విస్తీర్ణం నివాస ఖాళీ ప్లాట్ నం. 1 యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: పొరుగు వారి భూమి, దక్షిణం: ప్లాట్ నం.లు 2, తూర్పు: 60' వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నం.లు 18 మరియు 19.

3) డాక్యుమెంట్ నెం. 1416/2008 తేది.21.04.2008 ప్రకారం యజమాని శ్రీ జాదవ్ గోవింద్ రావు కు చెందిన నిర్మల్ జిల్లా, బాసర గ్రామం & మండలం, అమ్మగుంటం భవన్ ప్రక్కన ఇంటి నం. 9-12 సమీపంలో గల సర్వే నం. 504/సి లో 281.20 చ.గ.ల. విస్తీర్ణం నివాస ఖాళీ ప్లాట్ నం. 2 యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం. 1 దక్షిణం: ప్లాట్ నం. 3, తూర్పు: 60' వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నం.లు 17&18.

4) డాక్యుమెంట్ నెం. 3230/2013 తేది.12.08.2013 మరియు 851/2014 తేది.10.03.2014 ప్రకారం శ్రీ జాదవ్ ప్రదీప్ కు చెందిన నిర్మల్ జిల్లా, భైంసా మండలం, శ్రీ నారాయణ నగర్, పార్డి బి బైపాస్ రోడ్ ఇంటి నం. 4-3-1/15 సమీపములోగల సర్వే నం. 161/ఎ లో వాణిజ్య ఖాళీ ప్లాట్ నం. 31, 32, 32/1, & 32/2 లలో వరుసగా 100 చ.గ.లు, 50 చ.గ.ల., 25చ.గ.లు, 25 చ.గ.లు మొత్తం 200 చ.గ.ల విస్తీర్ణం అన్ని యావత్తు. సరిహద్దులు: ప్లాట్ నం. 32 కోసం సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం. 31 దక్షిణం: ప్లాట్ నం. 33, తూర్పు: పార్డి బి కే బైపాస్ రోడ్డు పడమర: ప్లాట్ నం. 54. ప్లాట్ నం. 31 కోసం సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం. 30 దక్షిణం: ప్లాట్ నం. 32, 32/1 & 32/2, తూర్పు: రోడ్డు పడమర: ప్లాట్ నం. 54. ప్లాట్ నం. 32/1 కోసం సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం. 31 దక్షిణం: ప్లాట్ నం. 33, తూర్పు: రోడ్డు పడమర: ప్లాట్ నం. 32. ప్లాట్ నం. 32/2 కోసం సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం. 31 దక్షిణం: ప్లాట్ నం. 33. తూర్పు: ప్లాట్ నం. 32, పడమర: ప్లాట్ నం. 54.

5) డాక్యుమెంట్ నెం. 2784/2013 తేది.27.06.2013 ప్రకారం శ్రీ జాదవ్ నాగేందర్ కు చెందిన నిర్మల్ జిల్లా, భైంసా రెవెన్యూ మండలం, మున్సిపాలిటీ క్రింద భైంసా గోకుల్ నగర్, రాంగోపాల్ ఏరియా కమలా థియేటర్ సమీపంలోగల సర్వే నం. 327/బి లో ప్లాట్ నం. 89 & 90 పై నిర్మించిన 66.66 చ.గ.ల విస్తీర్ణం మరియు ప్లింత్ ఏరియా జి.ఎఫ్. 300 చ.అ.లు. ఎఫ్ఎఫ్ 300 చ.అ.లు. గల ఇంటి నం. 4-3-3/61/4 గల ఆర్‌సిసి రూఫ్ వాణిజ్య భవనము. సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ ప్లాట్ నం. 91 దక్షిణం: ఖాళీ ప్లాట్ నం. 88, తూర్పు: 20' వెడల్పు రోడ్డు, పడమర: ఖాళీ ప్లాట్ నం.లు 74 & 75.

తేది: 06.04.2026 సం/- అధీకృత అధికారి,
ప్రదేశము: భైంసా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, (భైంసా బ్రాంచ్, నిర్మల్ రోడ్)



మట్టి నమూనాను బట్టి ఎరువులు వాడాలి

● 30 వేల మంది యువ రైతులకు సాయిల్ హెల్త్ వాలంటీర్లుగా శిక్షణ ● రైతు నేస్తంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మన తెలంగాణ/హైదరాబాద్ : మట్టి నమూనా పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులను శాస్త్రీయంగా వాడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. యూరియా యాప్ తో లైన్లలో నిలబడే బాధ తప్పిందని, ఇంట్లో నుంచే యూరియాను బుక్ చేసుకోని, ఉచిత సమయంలో తెచ్చుకునేందుకు వీలు కలిగిందని, దీంతో సమయం వృథా కాకుండా ఉందని రైతులు యూరియా యాప్‌ని కొనియాడినట్లు మంత్రి చెప్పారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని, సిఫార్సుల మేరకు నేల స్వభావానికి అనుగుణంగా శాస్త్రీయంగా ఎరువులు వినియోగించేలా ప్రణాళికలు అమలు చేస్తుందన్నారు. ఈ ప్రణాళికలో భాగంగా భూసార పరీక్షల అనంతరం రైతులకు అందించే నేల ఆరోగ్య కార్డులో పొందుపరిచిన వివరాలను సులభంగా అర్థమయ్యేలా వివరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల మంది యువ రైతులను వాలంటీర్లుగా ఎంపిక చేసి శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో ఇద్దరు నుంచి ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూసార పరీక్షా కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల కృషి విజ్ఞాన కేంద్రాలు, పరిశోధనా ల్యాబ్‌లతో పాటు మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌లను వినియోగిస్తూ భూసార పరీక్షలను వేగవంతం చేస్తున్నామన్నారు. అదనంగా ప్రయివేట్ భాగస్వామ్యంతో క్లస్టర్ స్థాయిలో మరిన్ని ల్యాబ్‌లు ఏర్పాటు చేసి పరీక్షా సదుపాయాలను విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. శిక్షణ పొందిన వాలంటీర్లు గ్రామ స్థాయిలో రైతులకు భూసార పరీక్షలు చేయించడంలో సహకరించడంతో పాటు, పరీక్షా ఫలితాల ఆధారంగా పంటల ఎంపిక, ఎరువుల వినియోగంపై సలహాలు అందిస్తారన్నారు.

సిఎస్‌తో అమెరికా-భారత్ వ్యూహాత్మక ఫోరమ్ ప్రతినిధుల భేటీ



మన తెలంగాణ/హైదరాబాద్: అమెరికా–భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరమ్ నుండి వచ్చిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం మంగళ వారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో సమావేశమైంది. ఈ ప్రతినిధి బృందంలో బీమా, ఆర్థిక సేవలు, వ్యవసాయం, సాంకేతిక రంగాలకు చెందిన వివిధ కంపెనీల ప్రతినిధులు ఉన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రం వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిపై ప్రతినిధి బృందానికి వివరించారు. 2014లో దేశంలోనే అత్యంత పిన్న రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ గత దశాబ్దకాలంలో విశేష పురోగతి సాధించిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల నుంచి గణనీయమైన పెట్టుబడుల వలన రాష్ట్ర స్థూల ఉత్పత్తి ఆదాయ ం గణనీయంగా పెరిగిందని చెప్పారు. భారతదేశంలో నగరీకరణ వేగంగా జరుగుతున్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటని, దాదాపు మూడో వంతు జనాభా హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్నారని ఆయన అన్నారు. హైదరాబాద్‌ను దేశంలోనే ఔషధ రాజధానిగా, సమాచార సాంకేతిక రంగంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల వల్ల రక్షణ రంగ స్టార్టప్‌ల అభివృద్ధికి కూడా దోహద పడిందని చెప్పారు. అలాగే గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లలో హైదరాబాద్ భారీ పెట్టుబడులను ఆకర్షించిందని, దేశంలో పేరు గాంచిన విద్యాసంస్థలు, ప్రపంచ స్థాయి ఆరోగ్య సదుపాయాలు, బలమైన ఫిన్‌టెక్ పరిసర వ్యవస్థ ఇక్కడ ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, మలాచీ బ్రియాన్ నుగెంట్, ఆర్ దీపక్ జోషి, దివదృష్ట్ సింగ్ (అమెరికాభారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరమ్), వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకులాల్లో పారదర్శకంగా సీట్ల భర్తీ



మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్

టీజీసెట్ ఫలితాలు విడుదల

మన తెలంగాణ / హైదరాబాద్ : సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన టిజిసెట్ 2026 ఫేజ్ 1 ఫలితాలను సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మంగళవారం సచివాలయంలో విడుదల చేశారు. 202627 విద్యా సంవత్సరానికి 6 నుండి 9 తరగతుల వరకు బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీతో పాటు తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయాల సొసైటీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పరిగి (బాలికలు), ఖమ్మం (బాలురు)లో 8వ తరగతి ప్రవేశాలకు ఈ ఫలితాలను విడుదల చేశారు. ఫిబ్రవరి 22న రాష్ట్రవ్యాప్తంగా 492 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 1,02,960 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫేజ్ 1లో మొత్తం 6,242 సీట్లు భర్తీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఏప్రిల్ 7 నుండి 20 వరకు తమకు కేటాయించిన పాఠశాలల్లో ధృవపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరుకావాలని మంత్రి అడ్లూరి సూచించారు. ఫలితాలను http://tgswreis.telangana.gov.in, లేదా http://tgcet.cgg.gov.in వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో అడ్మీషన్ ప్రక్రియను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసేలా మెంటరింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు.



దేశభక్తిని చాటిన ‘దురంధర్’

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

పార్టీ నేతలతో సినిమా వీక్షణ

మన తెలంగాణ/హైదరాబాద్:దేశ భక్తి, పౌరుల బాధ్యత, విలువల గురించి కళ్ళకు కట్టినట్లు చక్కగా చూపించిన ‘‘ధురంధర్2’’ సినిమాను దేశంలోని ప్రతి ఒక్కరూ చూడాల్సిన అవసరం ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. ధురంధర్ సినిమాను మంగళవారం రాంచందర్ రావు తన పార్టీ కార్యవర్గంతో పాటు ముఖ్య నాయకులు, మీడియా ప్రతినిధులతో కలిసి చూశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ళ వీరేందర్ గౌడ్ సౌజన్యంతో ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఓడియన్ మల్టీప్లెక్స్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనకు పార్టీ నాయకులు గౌతం రావు, చంద్రశేఖర్, ముఖ్యఅధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్, మాజీ మేయర్ కార్తీక రెడ్డి, మీడియా సెల్ డాక్టర్ స్వాతి తదితరులు హాజరయ్యారు. చిత్ర ప్రదర్శన అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ మన దేశాన్ని రక్షించడంలో సరిహద్దుల్లో పోరాడే సైనికులే కాకుండా, గూఢచారులు కూడా ఎంతటి త్యాగాలు చేస్తారో ఈ సినిమాలోని అనేక సన్నివేశాలు స్పష్టంగా ప్రతిబింబించాయని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక దేశాల్లో భారత గూఢచారులు దేశ సమగ్రత, భద్రత కోసం పనిచేస్తూ, శత్రు దేశాల కుట్రలను వెలికి తీసే విధంగా సేవలు అందిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా దేశభక్తి మాత్రమే కాదు, దేశ రక్షణపై బాధ్యతను కూడా పెంపొందిస్తుందన్నారు. ప్రత్యేకంగా, ఈ చిత్రంలో డీమానిటైజేషన్ (నోట్ల రద్దు) వెనుక ఉన్న కారణాలను స్పష్టంగా వివరించడమే కాకుండా, అప్పటి నిర్ణయం ఎంత సరైనదో మళ్లీ నిరూపించిందని ఆయన చెప్పారు. పాకిస్తాన్ నుంచి భారీ స్థాయిలో నకిలీ నోట్లను పంపించి భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయాలనే కుట్రలను, అలాగే చిన్న పిల్లలను దుర్వినియోగం చేస్తూ దేశంలో అశాంతిని సృష్టించాలనే ప్రయత్నాలను ఈ సినిమా బలంగా ప్రతిబింబించిందని ఆయన తెలిపారు.

రైల్వే పెండింగ్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి

అధికారులకు సిఎస్ రామకృష్ణా రావు ఆదేశం

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అన్నారు. రాష్ట్రంలో పలు రైల్వే ప్రాజెక్టులకు సంబందించిన అపరిష్కృత అంశాలపై సిఎస్ మంగళవారం సచివాలయంలో సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, జయేష్ రంజన్, నవీన్ మిట్టల్, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి, జిహెచ్‌ఎంసి కమీషనర్ ఆర్‌వి కర్ణన్, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కమీషనర్ సృజన, దక్షిణ మండలం విద్యుత్ సరఫరా సంస్థ ఎండి జితేష్ పాటిల్ , మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి తదితర అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి రైల్వే అండర్ బ్రిడ్జిలు, చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి ప్రజారవాణా మరింత మెరుగు పరచడం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ పెండింగ్ అంశాలకు సంబంధించి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

మనతెలంగాణ/హైదరాబాద్ : ఉపాధి హామీ పథకాన్ని తొలగించేందుకు మోదీ సర్కార్ కుట్ర చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదల మీద కక్ష గట్టినట్లు వ్యవహరిస్తూ వారి నోటి కాడి కూడు లాగేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరకు వీడియో సందేశం విడుదల చేశారు. పేదలకు మేలు చేసే ఉద్దేశంతో తెచ్చుకున్న ఉపాధి హామీ పథకాన్ని పథకం ప్రకారం తొలగించే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి చట్టబద్ధత లేకుండా చేశారని మండిపడ్డారు. చట్టబద్ధత ఉంటే నిధులు ఇవ్వడం తప్పనిసరి అవుతుందని.. కానీ, ఈ పథకాన్ని ఒక ప్రోగ్రామ్‌గా మార్చేసి నిధులు ఇవ్వకుండా పేదలకు అన్యాయం చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని రద్దు చేసిన కూడా అడిగే పరిస్థితి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం వచ్చిన తర్వాత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎంతో కొంత మెరుగుపడిందని కవిత చెప్పారు. అలాంటి ఈ పథకం పని దినాలను తగ్గించటం, నిధులు ఇవ్వకుండా చేయటం ద్వారా గ్రామాల్లో పేదల కడుపు కొడుతున్నారన్నారు. తెలంగాణలో కొవిడ్ తర్వాత 2021 22 లో 14 కోట్ల పని దినాలు ఉంటే గతేడాది 7 కోట్లకు పని దినాలను తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా ఉపాధి హామీలో పని దినాలు కల్పించే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారన్నారు. వారికి ఉద్యోగ భద్రతతో, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.